



19 వ వసంతంలోకి ...
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
మంగళవారం 2 డిసెంబర్ 2025 పేజీలు 8







# ఆరోగ్యకర సమాజంతోనే...

## వికసిత్ భారత్, స్వర్ణాంధ్రలు సాధ్యం

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** రాష్ట్రాన్ని 2030 నాటికి ఎయిడ్స్ రహిత లక్ష్యంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. వరల్డ్ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరై మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమాల వల్ల గతంలో

2





# సమయానికి పింఛన్లు

**అత్యధిక పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్**

**నగరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పింఛనుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయానికి పింఛన్లు అందిస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం ఉదయం మంత్రి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, సొడిశెట్టి బాలాజీ తదితర నాయకులతో కలిసి నగరంలోని 16వ డివిజన్లో పర్యటించి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. డయాలసిస్ పేషంట్ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి రూ. 10 వేలు, అదేవిధంగా పక్షవాతం బాధితుడు చందాల ఆదినారాయణ వరప్రసాద్ కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 15 వేల పింఛను అందించారు. మంత్రి లబ్ధిదారులతో ముచ్చటించి

2

**ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులు కండి..**

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**




వివరాలు 2లో

## భవితకు బంగారు బాటవేస్తాం మనోధైర్యంతో ఉండండి...

## పింఛన్లతో పేదలకు..

# కూటమి భరోసా

**పింఛన్లు అత్యధికంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్**

**ఎమ్మెల్యే గద్దె రామమోహన్ను చూసి చాలా స్ఫూర్తిని పొందా**

**హోమ్ మంత్రి వంగలపూడి అనిత**

వివరాలు 2లో

**15వ డివిజన్, రామలింగేశ్వర నగర్లో రూ.1 కోటి 40 లక్షల వ్యయంతో చేపట్టిన రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన చేసి పింఛన్లు పంపిణీ చేసిన వంగలపూడి అనిత, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్**

(మొదటిపేజీ తరువాయి)

## సమయానికి పింఛన్లు

వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు డివిజన్లోని ఐదు రోడ్ల సెంటర్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అర్హులైన పల్లపోతు సురేంద్ర, మానేపల్లి పుల్లారావు అనే ఇరువురు లబ్దిదారులకు సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ ఆర్థిక సహాయం మంజూరు పత్రాలను అందించారు. అనంతరం మంత్రి పింఛన్ లబ్ధిదారుడు చందాల ఆదినారాయణ వరప్రసాద్ గృహం వద్ద మీడియాతో మాట్లాడారు. ప్రతి నెలలో మొదటి తారీకునే తెల్లవారుజామున నుంచి పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపడుతున్నామన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మొదటి తారీఖున ఆదివారం లేదా ప్రభుత్వ సెలవు వస్తే దానికి ముందు రోజునే ప్రభుత్వ యంత్రాంగం పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 64 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతి నెలా 2,730 కోట్లతో సంవత్సరానికి దాదాపు రూ. 35 వేల కోట్లను పింఛన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలుపుతూ, దేశంలో ఏ రాష్ట్రం లోనూ ఇవ్వనంతగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెద్ద మొత్తంలో పింఛన్లు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.కృష్ణాజిల్లాలో 2.30 లక్షల మంది లబ్దిదారులకు ప్రతి నెల పింఛన్లు అందిస్తున్నామని, బందరు పట్టణంలో దాదాపు 18 వేల పింఛన్లు, బందరు మండలంలో 12వేల పింఛన్లు తెల్లవారుజామున మొదలుపెట్టి మధ్యాహ్నానికి నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు, డయాలసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, వితంతువులు, వృద్ధులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు చొప్పున పేదలకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఆదాయ వనరులను పెంచుకొని సమయానికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. దీనితోపాటు వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలుపుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం, విద్యార్థులకు తల్లికి వందనం, రైతన్నకు అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించి సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చామని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. పర్యటనలో భాగంగా మంత్రి ఐదు రోడ్ల సెంటర్లో హనుమకొండ లక్ష్మి నడుపుతున్న అయ్యప్ప టీ స్టాల్ ను సందర్శించి తేనీటిని సేవించారు. ఆమెతో ముచ్చటిస్తూ బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో నాటి రోజులను గుర్తు చేసుకుంటూ డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ టీ షాపులో స్వయంగా కాఫీని తయారు చేసి వినియోగదారులకు అందించారు. సహాయంగా మంత్రి, ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కాఫీ తయారీ ముడి పదార్థాలను డీసీఎంఎస్ ఛైర్మన్ కు అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ జెడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, 16వ డివిజన్ కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్,లోగిశెట్టి స్వామి, బచ్చు అనీల్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భవితకు బంగారు బాటవేస్తాం మనోధైర్యంతో ఉండండి

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** తల్లిదండ్రులను కోల్పోయినంత మాత్రన మీరు అనాథలు కారని మేమందరం మీకు అండగా ఉండి భవిష్యత్తు బంగారు బాటలు వేస్తామని మనోధైర్యంతో ఉన్నత విద్యాను అభ్యసించి సమాజంలో ఉత్తమ పౌరులుగా జీవించేందుకు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ అనాథ చిన్నారులకు భరోసా ఇచ్చారు..ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బెంజ్ సర్కిల్ సమీపంలోగల వాసవ్య మహిళా మండలిలో సోమవారం ఆనాథుల బాలలతో ఏర్పాటు చేసిన అల్పాహారం విందులో జిల్లా కలక్టర్ డా. జి. లక్ష్మీశ పాల్గొన్ని చిన్నారులతో మమేకమై అల్పాహారం స్వీకరించారు. చిన్నారులు తమ కుటుంబం గురించి చెప్పిన కొన్ని మాటలకు కలెక్టర్ చలించి పోయారు. బాలలతో ముచ్చటిస్తూ మీరు అనాథలు కారని మేమందరం మీకు తల్లిదండ్రులమని మీ అలానే పాలన చూడవలసిన భాధ్యత మాపై ఉందన్నారు. మనోధైర్యంతో ముందడుగు వేసి మంచి విద్యాబుద్ధులు నేర్చుకుని అన్నత చదువులు చదివితే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎవరిపై ఆధారపడవలసిన అవసరం లేదని సమాజంలో అందరితో సమానంగా జీవించవచ్చునని చెబుతూ పిల్లలకు జీవితంపై భరోసా కల్పిస్తు మనోధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ లైగింక జీవితంలో కొందరు తాత్కాలిక సుఖానికి లోనై అడ్డదారులు తొక్కడం ద్వారా ఎయిడ్స్ వ్యాధిని కొనితెచ్చుకుంటున్నారన్నారు. తద్వారా వారి జీవితాలను నాశనం చేసుకోవడమే కాక ప్రాణాలు కోల్పోయి బిడ్డలను అనాథలును చేయడం దురదృష్టకరమన్నారు. ఎయిడ్స్ మహమ్మారిని సమూలంగా రూపుమాపి ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాల్సిన అవసరం ఉందన్నారు. వాసవ్య మహిళ మండలి కార్యదర్శి డా. జి రష్మి మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి భారిన పడిన వారికి ఉచిత మందులను పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా. జి. సమరం, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డా. ది కీర్తి, కార్యదర్శి జి. రష్మి, మెడికల్ డైరెక్టర్ డా.పి. దీక్ష, గోర సైన్స్ సెంటర్ డైరెక్టర్ జి. నియంత, ఎమిక్యూర్ ఫార్మా లిమిటెడ్ ప్రతినిధి మల్లికార్జునరావు, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకర సమాజంతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్రలు సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న 2.34 శాతం పాజిటివిటీ రేటు పది సంవత్సరాలు అయ్యేటప్పటికి 0.58 శాతానికి తగ్గిందన్నారు. పది సంవత్సరాల క్రితం 25 వేల కొత్త కేసులు నమోదు అయితే పది సంవత్సరాల్లో 13,000 కేసులకు తగ్గిపోయాయన్నారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉంటూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో అవగాహన కలిగించడం కారణంగా హెచ్ఐవి పాజిటివిటీ రేటు 0.10 శాతం నుండి 0.04 శాతం కు తగ్గిందన్నారు. ప్రభుత్వాలు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు కారణంగా పాజిటివిటీ రేటు తగ్గించగలిగామన్నారు. రూ. 35 వేల నుంచి రూ. 40 వేల ఖరీదు చేసే యాంటీ రెట్రో వైరల్ థెరపీ మందుల్ని ఉచితంగా 59 ఏఆర్టీ సెంటర్ల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. పాజిటివిటీ నిర్ధారణకు కన్ఫర్మేటరీ సెంటర్లకు వెళ్లడానికి ప్రజలకు సోషల్ స్టిగ్మా వల్ల ముందుకు రాని కారణంగా వారి ఇళ్ల దగ్గరికే వెళ్లడానికి లేదా సుదూర ప్రాంతాల్లో చేరడానికి వీలులేని అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజల్లో అవగాహన కల్పించి అక్కడ పరీక్షలు చేయడం కోసం 15 మొబైల్ ఐసిటిసిలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో తీసుకురాగలిగామన్నారు. అయినా దేశంలో రాష్ట్రం రెండో స్థానంలో ఉండటం దురదృష్టకరమన్నారు. గతంతో పోలిస్తే నేడు ఎయిడ్స్ తో మరణిస్తున్న వారి సంఖ్య కూడా ఘణనీయంగా తగ్గిందన్నారు. పాజిటివిటీ రేటు 2.34 శాతం నుండి 0.58 శాతానికి తగ్గేలా కృషి చేసిన వైద్య ఆరోగ్య, ఏపీ సాక్స్ సిబ్బంది అందరికీ అభినందనలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంధ సంస్థల సహకారంతో 2030 నాటికి ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ భారత్ నిర్మాణం చేయాలనేది ఒక లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 25 సంవత్సరాల క్రితం ఆనాడు హెచ్ఐవి సోకిందంటే ఒక డిప్రెషన్ కు లోనై జీవితం ఇక అయిపోయిందనే భావంతో ఉండేవారన్నారు. నేడు ధైర్యంగా నిలబడి ఆరోగ్యవంతంగా ఉండడమే కాకుండా ప్రజల్లో విశ్వాసం నింపి హెచ్ఐవి సోకిన వారిలో ఆత్మస్థైర్యం నింపేవిధంగా అనేక మంది పని చేస్తున్నారు.. అలాంటి వారిలో నెట్ వర్క్ కమ్యునిటీ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ లాంటివారిని ఉదాహరించవచ్చన్నారు. హెచ్ఐవి అంటే ప్రాణాలు పోతాయి అనే భావన ఇవాళ లేదని, ఎందుకంటే తాను గుంటూరులో మొదటిసారి ఏఆర్టీ సెంటర్ 2004 సంవత్సరంలో ఏర్పాటు చేసినప్పుడు మొట్టమొదటగా ఎవరైతే రిజిస్టర్ చేసుకున్నారో వారు ఇంకా జీవించి ఉన్నారన్నారు. ఎయిడ్స్ సోకడం వల్ల ప్రాణాలు పోవట్లేదు కదా అనే నిర్లక్ష్యం పనికిరాదని ఆ నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం కాకూడదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని ముఖ్యంగా యువత గుర్తించుకోవాలన్నారు. కొంతమంది ఏ తప్పిదం లేకపోయినా రమణ లాంటి చిన్నారుల పరిస్థితి వర్ణనాతీతం అన్నారు. గత ఏడాది కొత్తగా నమోదైన ఎయిడ్స్ కేసుల్లో విచిత్రంగా ఐటీ ఉద్యోగస్తులు ఉండటం ఆందోళకర విషయమని అన్నారు. నేడు ఐటీ ఉద్యోగస్థులలో కూడా కేసులు పెరుగుతున్నాయంటే రెండో వైపు దీని తీవ్రతను కూడా గుర్తించాల్సి ఉందన్నారు. అయినప్పటికీ ఆందోళన చెందాల్సిన, ప్రాణం పోతుందని భయపడాల్సిన అవసరం నేడు లేదన్నారు. సేఫ్ సెక్స్ మీద ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, కళాశాలల్లో అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలని, తల్లితండ్రులు ఇళ్లల్లో తమ పిల్లలకి సేఫ్ సెక్స్ గురించి ఎయిడ్స్ వ్యాప్తి పై ఖచ్చితంగా అవగాహన ఏర్పరచాలన్నారు. పాఠశాలల్లో ఎయిడ్స్ సోకిన విద్యార్థులు ఎవరన్నా ఉంటే వారి పట్ల వివక్ష చూపరాదని అది కూడా అన్ని రోగాల లాగా డయాబెటిస్, హైపర్టెన్షన్ లాంటి ఒక రోగంలా ఉంటుందన్నారు. మారుమూల ప్రాంతాలలో కూడా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించే ప్రయత్నం చేస్తున్నామని, అవి పూర్తి ఉచితమన్నారు.

దాదాపు 42 వేల మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇవాళ పెన్షన్లు అందిస్తుందని, త్వరలో మిగిలిన అర్హులైన వారికి కూడా పెన్షన్లు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ హెచ్ఐవి వ్యాధిపట్ల అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలని, యువతలో కూడా వీటి పట్ల అవగాహన కల్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటే ఒకప్పుడు భయానక పరిస్థితి ఉండేదని నేడు ఆ పరిస్థితులు మారుతూ వచ్చాయన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెచ్ఐవి నివారణ, బాధితుల సంక్షేమానికి ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల పూర్తి అవగాహన కల్గి ఉన్ననాడే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యపడుతుందన్నారు. వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం పొందితే వారి జీవిత కాలం పెరుగుతుందన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలకంఠా రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని అప్రమత్తం చేయడానికి ప్రతి ఏడాది డిసెంబర్ 1 న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం రోజు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేబీఎస్.చక్రధర్ బాబు, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డా. పద్మావతి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం, నెట్వర్క్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. తొలుత స్నేహ, వాసవ్య మహిళా మండలి, శాంతి కల్చరల్ సొసైటీ కళాజాత లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

# పింఛన్లతో పేదలకు.. కూటమి భరోసా



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని పేదలకు ప్రతి నెలా క్రమం తప్పకుండా మొదటి తేదిన వారి ఇంటికి వెళ్ళి మరీ ఫించన్లు అందచేస్తూ పేదలకు తమ ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని రాష్ట్ర హోమ్ శాఖామంత్రి వంగలపూడి అనిత, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. సోమవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్లోని రుద్రభూమి దగ్గర సుమారు కోటి నలభై లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర హోమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం డివిజన్లోని అర్హులైన పించనుదారుల ఇంటికి వెళ్ళి ఫించను నగదును స్వయంగా అందచేశారు. ఈ సందర్భంగా హోమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచి క్రమం తప్పకుండా మొదటి తేదిన అర్హులైన ఫించను లబ్ధిదారులందరికి తెల్లవారుజామునే ఇంటికి వెళ్ళి ఫించన్లు అందచేస్తున్నామని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కంటే ఎక్కువగా పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ మొత్తంలో సుమారు 64 లక్షల మందికి రూ.2,739 కోట్లలను ప్రతి నెలా పింఛన్ల రూపంలో అందజేస్తున్నామని చెప్పారు. ఫించను తీసుకుంటున్న వారిలో ఎక్కువుగా మహిళలే ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను రూ.4 వేలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల సందర్భంగా చెప్పినప్పుడు అది ఎలా సాధ్యమని ప్రశ్నించారని, నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత నెలకు రూ.4 వేలతో పాటుగా హామీ ఇచ్చిన రోజు నుంచి రెండు నెలల బకాయిలతో పాటు కలిపి పింఛన్లు అందజేశారని గుర్తుచేశారు. ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తామంతా మద్దతుగా ఉంటామని అనిత చెప్పారు.

**మృదుస్వభావి గద్దె రామమోహన్ నుండి ఎంతో స్ఫూర్తి పొందాను: అనిత**

సీనియర్ ఎమ్మెల్యే, మృదుస్వభావి, ప్రజాసేవకుడు అయిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్ను చూసి తాను ఎంతో స్ఫూర్తిని పొందుతున్నానని హోమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత తెలియజేశారు. విజయవాడ వంటి నగరంలో ఎమ్మెల్యే అంటే చాలా రఫ్ గా ఉంటారని అనుకున్నాను కానీ, ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నికైన గద్దె రామమోహన్ను చూస్తే చాలా మృదుస్వభావం కలిగి ఉంటారని పేర్కొన్నారు. ఆయన నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే కాకుండా తన సొంత నిధులతో ఆర్థిక సహాయాలను అందజేస్తున్నారని అనిత చెప్పారు. దిత్వా తుఫాను సందర్భంగా ప్రజలను అప్రమత్తం చేశామని ఎటువంటి ప్రాణనష్టం లేకుండా అన్ని ముందు జాగ్రత్తలు తీసుకున్నామని అనిత చెప్పారు. తుఫాన్లు వచ్చిన సందర్భంలో ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఆర్టీజీఎస్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో తుఫాను కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారిని అప్రమత్తం చేశామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ గతంలో కృష్ణా నదికి వరద నీరు వచ్చినప్పుడు కృష్ణలంక ప్రాంత వాసులు చాలా ఇబ్బందులు పడేవారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయడం వల్ల కృష్ణా నదికి ఎంత వరద నీరు వచ్చినా కృష్ణలంక ప్రాంతానికి ఏవిధమైన ఇబ్బంది లేకుండా ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారని చెప్పారు. రామలింగేశ్వర నగర్లోని ఈ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ లేకపోవడంతో కొన్ని ఇళ్లల్లోకి నీటి ప్రవాహం వచ్చి ఇబ్బందులు పడుతున్నారని, ఆ ఇబ్బంది లేకుండా ఇప్పుడు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేస్తున్నామని వివరించారు. ఇప్పుడు కృష్ణానదికి ఎంత పెద్ద వరద వచ్చినా ఇక ఈ ప్రాంతంలోకి చుక్క నీరు రావని చెప్పారు. ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు వంగలపూడి అనిత శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అమ్మిశెట్టి వాసు, వి.ఎం.సి. ఇ.ఇ. సామ్రాజ్యం, సెంట్రల్ ఏసిపి దామోదర్, పటమట సి.ఐ. పవన్ కిషోర్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కూటమి పార్టీల డివిజన్ అధ్యక్షులు, ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఇ నేతృత్వంలోని ద్వితీయ అల్యూమినియం రంగానికి మద్దతు ఇస్తున్న రుసల్

RUSAL

విజయవాడ, డిసెంబర్ 01, మేజర్ న్యూస్ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఇలు) భారతదేశ అల్యూమినియం దిగువ స్థాయి పరిశ్రమకు వెన్నెముకగా నిలుస్తున్నాయి, దాదాపు ఒక మిలియన్ ఉద్యోగాలను అందిస్తున్నాయి. తయారీ, ఎగుమతి వృద్ధికి గణనీయంగా దోహదపడుతున్నాయి. దిగువ స్థాయి ఉత్పత్తులను ఉత్పత్తి చేయడానికి ఇన్‌పుట్ ఖర్చులు ఈ సంస్థల పోటీతత్వం, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రపంచంలోనే అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తిదారులలో ఒకటైన రుసల్, అధిక-నాణ్యత, పోటీ ధర కలిగిన ప్రాథమిక లోహాన్ని అందించడం ద్వారా భారతదేశ ఎంఎస్ఎంఇలకు మద్దతు ఇవ్వడానికి ఒక ముఖ్యమైన అవకాశాన్ని చూస్తోంది. రుసల్యొక్క లోహ ఉత్పత్తిలో ఉపయోగించే విద్యుత్‌లో 99 శాతానికి పైగా పునరుత్పాదక వనరుల నుండి వస్తుంది. కంపెనీ దాని ఎలవ్ బ్రాండ్ క్రింద తక్కువ-కార్బన్ అల్యూమినియంను మార్కెట్ చేస్తుంది, ఇది టన్ను లోహానికి 2.2 టన్నుల కంటే తక్కువ కార్బన్ సమానమైన సర్టిఫైడ్ కార్బన్ పాదముద్రను కలిగి ఉంది, ఇది పరిశ్రమ సగటు కంటే నాలుగు నుండి ఐదు రెట్లు తక్కువ. ఇది ఎంఎస్ఎంఇలు ఉత్పత్తి ఖర్చులను తగ్గించడంలో సహాయపడటమే కాకుండా తక్కువ-కార్బన్ తయారీకి అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ప్రమాణాలను చేరుకోవడానికి వాటిని సన్నద్ధం చేస్తుంది. తక్కువ- కార్బన్ ముడి పదార్థాలను యాక్సెస్ చేయడం ద్వారా, భారతీయ ఎంఎస్ఎంఇలు వారి పోటీతత్వాన్ని మెరుగుపరచడానికి, ఎగుమతి సామర్థ్యాలను విస్తరించడానికి, అంతర్జాతీయ వాతావరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటానికి ఇది సహాయపడుతుందని రుసల్విశ్వసిస్తుంది. స్థితిస్థాపకంగా, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న అల్యూమినియం పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి భారతదేశ ఎంఎస్ఎంఇలతో భాగస్వామ్యం చేసుకోవడానికి రుసల్కట్టుబడి ఉంది. స్థిరమైన సోర్సింగ్, వ్యూహాత్మక సహకారం ద్వారా, భారతదేశ పారిశ్రామిక ఆశయాలకు దోహదపడటం, ఎంఎస్ఎంఇ నేతృత్వంలోని వృద్ధి యొక్క తదుపరి అధ్యాయానికి మద్దతు ఇవ్వడం కంపెనీ గర్వంగా ఉంది.

# జాతీయతాభావం లక్ష్యంగా విద్యాబోధన అవసరం...




విజయవాడ మేజర్ న్యూస్ : రేపటితరం సమాజానికి వెన్నెముకగా నిలవాల్సిన నేటి తరం బాల బాలికలకు జాతీయత భావం, దేశభక్తి సమ్మిళితమైన విద్యాబోధన అవసరమని ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బహుదొడ్డ రాజశేఖర్ అన్నారు. ఎనికేపాడు విజ్ఞాన విహార ఆంగ్ల మాధ్యం పాఠశాల 41 వ వార్షికోత్సవ వేడుకలు పాఠశాల ప్రాంగణంలో సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి బాల బాలికలు ఉన్నతమైన సంస్కారంతో నైతిక విలువలు, మానవత్వంతో కూడిన స్పందన ద్వారా బాల బాలికలు భవిష్యత్తులో విజయపథంలో పయనిస్తారన్నారు. రుజువర్తన కలిగిన సమాజ నిర్మాణంలో నేటి బాల, బాలికలే కీలకపాత్ర పోషిస్తారన్నారు. విద్యతోపాటు ఇతర ఆసక్తికర అంశాలలో కూడా బాల బాలికలు ప్రావీణ్యత సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి సాహిత్య, సాంస్కృతిక, దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రజల జీవనశైలి వంటి అంశాల పట్ల ఆసక్తి చూపించాలని పేర్కొన్నారు. ప్రధానంగా రానున్న రోజుల్లో విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అసమానతలు లేని, దేశభక్తి కలిగిన సమాజ నిర్మాణం కోసం ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచి స్వాతంత్ర ఉద్యమం, ఆధ్యాత్మిక భావజాలం, పురాణ కాలం నుంచి ఋషులు అందించిన విజ్ఞానదాయకమైన అంశాలను తెలుసుకోవాలన్నారు. పాఠశాల కార్యదర్శి ఎం గోవిందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన శారీరక ప్రదర్శనలు, దేశభక్తి పూరితమైన జానపద గేయాలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదంగా సాగాయి. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా శ్రీనివాసులు, కార్న్ సీ సంస్థ ఉన్నతాధికారి ఈదుపుగంటి శ్రీధర్, పి. సూర్యనారాయణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. శైలజ, జి. రామాంజనేయులు తదితరులతో పాటు విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నష్టపోయిన ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



పామర్రు మేజర్ న్యూస్: నష్టపోయిన ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగుదేశం నాయకులు మాది రైతుల ప్రభుత్వం అని రైతులకు అన్నీ బాగా చేస్తున్నామని, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం జరిగిందని మాట్లాడుతున్న నాయకులు ఒక్కసారి నియోజవర్గంలో రైతుల పరిస్థితిని చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆనాడు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏ విధంగా రైతులు ఉన్నారు, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులు ఏ విధంగా ఉన్నారో తెలుగుదేశం నాయకులు కళ్లారా చూడాలని కోరారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులకు ధర లేకపోతే ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందని, రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడం జరిగిందన్నారు. ఆర్బీకేల వద్ద ధర్నాలు చేసిన వారు తెలుగుదేశం రైతులా వైయస్ఆర్ సీపీ రైతులా అనే భేదం లేకుండా మొత్తం ఆ గ్రామంలో ఉండే ప్రతి రైతు దగ్గర కొనమని చెప్పడం జరిగిందన్నారు. ఓ నాయకుడు చెప్పినట్టుగా రైతులతో ముఖాముఖి అయ్యి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులు ఏవిధంగా ఉన్నారో, తెలుగుదేశం ప్రభుత్వంలో రైతులు ఏవిధంగా ఉన్నారో రైతులనే అడుగుదామని సవాల్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు కూడా మాకు ఎరువులు దొరకలేదని, యూరియా దొరకలేదని రోడ్లు ఎక్కలేదని తెలుగుదేశం ప్రభుత్వంలో రైతులకు యూరియా దొరకక రోడ్లెక్కి, ధర్నాలు చేసిన పరిస్థితి చూస్తున్నామన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆర్బీకేలు పెట్టి రైతులకు ఎరువులు, పురుగుమందులు కావాలంటే దాని ద్వారా సరఫరా చేసిన ఘనత మాదని పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు కూడా ఒక రూపాయి కడితే ఇన్సూరెన్స్ ఇచ్చిన పరిస్థితి, పంటలకు కూడా ఇన్పుట్ సబ్సిడీ అందించడం జరిగిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తోందని, మీరు రైతులకు ఏం చేశారు? అంటూ ప్రశ్నించారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉన్న ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు తర్వాత సీజన్ పంటకు డబ్బులు చెల్లించిన ఘనత మా మా ప్రభుత్వానికి దక్కింది అన్నారు. తెలుగుదేశం నాయకులు రైతులకు, గిట్టుబాటు ధర, ఇన్పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ పాలసీలు ఇవ్వండి చాలు, సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని, ఈ 18 నెలల ప్రభుత్వ కాలంలో ఒక్క రైతుకైనా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారా? రైతులు వేల రూపాయల నుండి లక్షల్లో నష్టపోతున్నారని తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం ఎరువులు కూడా బ్లాకులో కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఇదివరకు ఎప్పుడూ ఇలాంటి దారుణమైన పరిస్థితులు లేవని ఆయన అన్నారు. ఇన్ని కష్టాలు పడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా దొరకడం లేదని, ప్రతి అడుగులోనూ రైతు నష్టపోతున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.



# భగవద్గీత విజేతలకు విక్కుర్తి శ్రీనివాస్ బహుమతులు

అవనిగడ్డ మేజర్ న్యూస్ : గీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని భగవద్గీత కంఠస్థ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి వీరరాఘవయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ నగదు బహుమతులను సమకూర్చారు. స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్లో గత పది రోజులుగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలలో విజేతలగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతికి వెయ్యి రూపాయలు రెండవ బహుమతి 500 రూపాయలు మూడవ బహుమతిగా 300 రూపాయలను అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి నోట్ పుస్తకాలు పెన్నులు ఇచ్చారు. రామచంద్రపురం గ్రామానికి చెందిన మత్తి శేషగిరిరావు (గురూజీ) విద్యార్థుల చేత భగవద్గీత శ్లోకాలను కంఠస్థం చేయించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## వైభవంగా సత్యదేవ వ్రతాలు

అవనిగడ్డ మేజర్ న్యూస్ : మార్గశిర శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను జరుపుకున్నారు. సోమవారం స్థానిక శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయ ఆవరణలోని ఆస్థాన మండపంలో బ్రహ్మశ్రీ సూర్య స్వామి నేతృత్వంలో సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను నిర్వహించారు ఆలయ ధర్మకర్త పోతురాజు భాస్కరరావు దంపతులు వ్రతానికి అవసరమైన పూజా సామాగ్రిని భక్తులకు ఉచితంగా అంద చేశారు. అర్చక స్వాములు శాస్త్రోక్తంగా వ్రత విధానాన్ని నిర్వహించి, సత్యనారాయణ స్వామి వ్రత కథల ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## అవనిగడ్డలో వైభవంగా గీతా జయంతి వేడుకలు



అవనిగడ్డ మేజర్ న్యూస్: గీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక గీతా మందిరంలో గీతాచార్యుల వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సోమవారం గీతా చార్యుల వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహికంగా భగవద్గీత లోని 18 అధ్యాయాలు పారాయణం చేశారు. లక్ష్మీ తాయారమ్మ హిమబిందుల ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేయగా, ఈ సందర్భంగా చేసిన భజనలు సంకీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ అర్చకులు దివి నరసింహమూర్తి, సూర్యాలు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త హరి బాబు నేతృత్వంలో భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేయగా వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.

## ఈ నెల 3న ఎన్జీజీఓ నగరశాఖ సర్వ సభ్య సమావేశం

### అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్

విజయవాడ, డిసెంబర్ 01, మేజర్ న్యూస్ : ప్రతిష్ఠాత్మకైన ఏపి ఎన్జీజీఓ నగర యూనిట్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 3 వ తేది బుధవారం విజయవాడ గాంధీనగర్ లోని ఎన్ జి ఓ హోమ్‌లో నిర్వహించనున్నట్లు నగరశాఖ అధ్యక్షులు సి వి ఆర్ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. 2 వేల మందికి పైగా సభ్యులు గల నగర శాఖకు త్వరలో ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రస్తుత కమిటీ గత 3 సంవత్సరాలుగా చేపట్టిన కార్యక్రమాలు సాధించిన విజయాలు సంఘ కార్య కలాపాలు జమా ఖర్చులు తదితర అంశాల పై కార్యదర్శి కోశాధికారి నివేదిక సమర్పిస్తారని తెలిపారు. సర్వ సమావేశానికి సభ్యుల వివిధ శాఖల ఉద్యోగులు హాజరై జయప్రదం జేయాలని సి వి ఆర్ ప్రసాద్ ప్రకటనలో కోరారు.

## సామ్‌సంగ్ ఇండియా నుంచి గెలాక్సీ ట్యాబ్ ఏ 11 ప్లస్




విజయవాడ మేజర్ న్యూస్ : భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, గెలాక్సీ ట్యాబ్ ఏ 11 ప్లస్ ను విడుదల చేసినట్లు వెల్లడించింది. వేగవంతమైన, అతి తక్కువ విద్యుత్ వినియోగంతో కూడిన పనితీరుతో ఎక్కువ మంది వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చే కీలకమైన ఏఐ సామర్థ్యాలను పరిచయం చేస్తుంది. ఇది సౌకర్యవంతమైన మల్టీ టాస్కింగ్‌కు అనువైనది. గెలాక్సీ ట్యాబ్ ఏ 11 ప్లస్ తెలివైన ఫీచర్లను లీనమయ్యే 11 అంగుళాల డిస్ప్లే, సొగసైన మెటల్ డిజైన్‌తో మిళితం చేస్తుంది. గెలాక్సీ ట్యాబ్ ఏ 11 ప్లస్ మృదువైన స్క్రోలింగ్, స్ట్రీమింగ్, డిజిటల్ లెర్నింగ్ కోసం లీనమయ్యే వీక్షణ అనుభవాన్ని అందిస్తుంది. చలనచిత్రం, సంగీతం, ఆన్‌లైన్ లెర్నింగ్ కోసం గొప్ప, సమతుల్య ఆడియోను అందించే డాల్బీ అట్మాస్‌తో కూడిన క్వాడ్స్పీకర్‌తో వైబ్రెంట్ డిస్ప్లే అనుబంధించబడింది. గెలాక్సీ ట్యాబ్ ఏ 11 ప్లస్ నవంబర్ 28 నుండి రూ. 19,999 నుండి అమెజాన్, సామ్‌సంగ్ డాట్ కాం, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్‌లలో అందుబాటులో ఉంది.



## డివైడర్ పై వాహనాలు తొలగించండి..

### పోలీసులకు యార్లగడ్డ ఆదేశం

**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ రామవరప్పాడు రింగ్ సమీపం లోని డివైడర్ పై ఉంచిన వాహనాలను తొలగించాలని ప్రభుత్వ విప్, గన్న వరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పోలీసులను ఆదేశించారు. రామవర ప్పాడు రింగ్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీస్ లు సరైన ధ్రువీ కరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, ఆటోలను సీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో సీజ్ చేసిన వాహనాలను రామవరప్పాడు రింగ్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో రహదారి డివైడర్ విశాలవంతంగా ఉండటంతో అక్కడే ఉంచుతున్నారు. సీజ్ చేసిన వాహనాలను నెలల తరబడి అక్కడే వదలివేయటంతో అవి దుమ్ము కొట్టుకుపోయి, తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇదే దారి లో వెళుతున్న యార్లగడ్డ డివైడర్ పైన ఉన్న వాహనాలను గమనించి వాటిని అక్కడి నుంచి తొలగించాలని పడమట పోలీసులను ఫోన్లో ఆదేశించారు. వివిఐపిలు, వీఐపీలు సంచరించే మార్గాన్ని అందంగా ఉంచేందుకు మొక్కలు నాటి సుందరీకరణ పనులు చేపడుతుండగా పోలీసులు ఈ విధంగా డివైడర్ పై వాహనాలు ఉంచి డంపింగ్ యార్డ్ లా మార్చుడాన్ని ఆయన తప్పు పట్టారు. తక్షణమే ఈ వాహనాలు అన్నింటిని ఇతర ప్రాంతాలకు తరలించాలని ఉన్నతాధికారులను కోరారు.

## పెన్షన్‌లు పంపిణీలో ఏఎంసి చైర్మన్ వెంకటేశ్వరరావు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం ప్రతినెల 1వ తేదీ గ్రామ సచివాలయం సిబ్బందితో "పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లు పంపిణీ" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు అన్నారు. సోమ వారం స్థానిక 8 9 వార్డులలో గ్రామ సచివాలయం సిబ్బందితో లబ్ధిదా రులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లు పంపిణీ చేస్తుండగా కార్యక్రమంలో పాల్గొన్న కొల్లూరి మాట్లాడుతూ పేదలకు సకాలంలో సంక్షేమ పథకాలు అం దాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉంటేనే సాధ్యపడుతుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బండే రాఘవ, పర్చూరు దుర్గాప్రసాద్, మండలి రామ్మోహన్రావు, ఘంటసాల రాజమోహన్రావు, భగవత్ గోపి, కొల్లూరి వాసు, ముళ్ళపూడి శ్రీనివాసరావు, కొండవీటి గోవిందు, బట్టు నరసింహారావు, తదితరులు ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ఇంటింటికి తిరిగి పింఛన్లు అందించిన కూటమి నేతలు



**పామర్రు మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమాన్ని కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పండుగ వాతావరణంలో ఇంటిం టికి తిరుగుతూ లబ్ధిదారులకు అందజేశారు. ప్రతినెల 1వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకుల పిలుపుమేరకు గ్రామాలలో స్థానిక నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొంటున్నారు. ప్రతి నెల పంపిణీ చేస్తున్నట్లుగానే ఈనెల కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులకు పింఛన్ నగదును అందిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదేశాలతో నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మండల పరిధిలోని జుజ్జువరం గ్రామంలో పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పలువురు పాల్గొని ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే కొండిపర్రు, వీరాంజనేయపురం గ్రామాలలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుడు నూకారపు వీరాంజనేయులు, పార్టీ గ్రామ కార్యదర్శి ఏకుల చిరంజీవి, బూత్ కన్వీనర్లు పసుపులేటి విజయకుమార్, ముదునూరి సువర్ణ రాజు తదితరులు పాల్గొని పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.

# పెన్షన్ లబ్దిదారులకు పెన్షన్ అందించిన వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, డిసెంబర్ 01, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఉదయం పెజ్జోని పేట, సి కె రెడ్డి రోడ్డు, పరిసర ప్రాంతాలని పర్యటించి పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఆ ప్రాంతాల్లో గల పెన్షన్ దారుల ఆధార్ కార్డు పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ ఆర్ ఎస్ ) ద్వారా చెక్ చేసి పెన్షన్ డబ్బులు అందించారు. వారితో మాట్లాడి వాళ్లకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ప్రతినెల పెన్షన్ వస్తుందా లేదా, ఇంటికి వచ్చి ఇస్తున్నారా లేదా, ఎంత డబ్బులు ఇస్తున్నారు లాంటి ప్రశ్నలు వాళ్ళని అడిగి, ప్రతినెలా ఇస్తున్న పెన్షన్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉదయం ఆరింటికల్లా పెన్షన్ పంపిణీ మొదలుపెట్టాలని, పెన్షన్ పంపిణీలో ఎటువంటి అలసత్వం వహించరాదని, పెన్షన్ దారుల ఇంటి వద్దకు వెళ్లి కచ్చితంగా పెన్షన్ అందించాలని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోగల సర్కిల్ 1 పరిధిలో 18,726 పెన్షన్లు, సర్కిల్ 2 పరిధిలో 23,549, సర్కిల్ 3 పరిధిలో 18,460 పెన్షన్లు ఉన్నాయని, వారందరికీ సిబ్బంది సకాలంలో పెన్షన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. తదుపరి గాంధీజీ మహిళా కళాశాల, వన్ టౌన్ వద్ద గల అన్న కాంటీన్ పరిశీలించారు. అక్కడ వచ్చిన ప్రజలతో మాట్లాడి స్వయంగా ఆహార నాణ్యతను అడిగి తెలుసుకు న్నారు. కిచెన్ పరిశుభ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు, తాగునీరు, వాడుక నీరు నిరంతరాయంగా రావాలన్నారు. నోడల్ ఆఫీసర్లు అందరూ తమ తమ అన్న క్యాంటీన్లోని ప్రతిరోజు వీక్షించి ఎటువంటి లోపాలు ఉన్న వెంటనే సరి చేయాలని, ఎటువంటి రిపేర్లు ఉన్న వెంటనే మరమ్మతులు చేయించేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారాలను ఆదేశించారు. ఈ పర్యటనలో కమిషనర్ తో పాటు జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సి డి ఓ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు..

# రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పింఛన్ల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది

### సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఎక్కువ మొత్తంలో పింఛన్లు 63 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెల అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుది మాత్రమేనని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. సోమవారం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్, 45 వ డివిజన్ సచివాలయ సిబ్బందితో కలసి డివిజన్ లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ పెన్షన్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రె పాటి గోపీచంద్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ,రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోంది అని అన్నారు.ముఖ్యంగా సామాజిక పింఛన్ల పంపిణీని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, ప్రతినెలా ఒకటవ తేదీనే సూర్యోదయానికి ముందే అవ్వ తాతలు, వితంతువులు, దివ్యాంగుల గడప వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని గుర్తు చేశారు.

# బడుగు బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ పార్టీ







**అవనిగడ్డ మేజర్ న్యూస్:** దేశంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ప్రయోజనాలు నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఏఐసీసీ కార్యదర్శి సంజయ్ దత్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అందే శ్రీరామ్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా పార్టీ పరిశీలకులు సంజయ్ దత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఎన్ డి ఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారీ వర్గాల కోసం, ధనవంతుల కోసం పనిచేస్తున్నాయన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు సంస్థాగత సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1977లో ఇందిరాగాంధీ ఈ ప్రాంతానికి వచ్చిందని, ఈ రాష్ట్రానికి ఇందిరా చేసిన సేవలు మరువలేని అన్నారు. ఇందిరాగాంధీ దేశంలో పేద, బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీల కోసం పనిచేస్తుందని, వారి బాటలోనే రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ పనిచేశారన్నారు. గత 11 సంవత్సరాల నుండి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, గత రెండేళ్ల నుండి ఆంధ్ర రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఏ విధమైన పరిపాలన అందిస్తున్నదో ప్రజలు గమనించాలన్నారు. ఈ ప్రభుత్వాల వల్ల పేదలకు ఏమైనా మేలు జరుగుతుందా అని ప్రశ్నించారు. పెట్టుబడిదారులు మరింత కుబేరులు గా మారుతున్నారని, పేద వర్గాల వారు మాత్రం రోజురోజుకు వారి జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి అన్నారు. పేద ప్రజల గురించి, సామాన్యుల గురించి ఆలోచించే పరిస్థితి ఈనాటి ప్రభుత్వాలకు లేవన్నారు. ఆనాడు ఆహార భద్రత కోసం మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. మరోవైపు అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను ఈ దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు హక్కులు హరించబడుతున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని ఇందుకోసం కులాలను రెచ్చగొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. దీనిని ఎండ కట్టేందుకు దేశంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ప్రచారం నిర్వహిస్తున్నారని ముఖ్యంగా ఓట్ల చోరీ ద్వారా ప్రభుత్వాలను హస్తగతం చేసుకోవాలని బిజెపి ప్రభుత్వ వ్యూహాలను చిప్పికొట్టేందుకు రాహుల్ గాంధీ, కార్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ ప్రజలను చైతన్య పరిచేందుకు కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఈరోజు ప్రతి ఇంట్లో నిరుద్యోగులు ఉన్నారని అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, నల్ల డబ్బు తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూపు 15 లక్ష లు బ్యాంక్ ఖాతాలో వేస్తామని ప్రగాల్భాలు పలికారని ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు, ఎన్ని లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ చేశారు ప్రజలు తెలుసుకోవాలన్నారు. దేశంలో దుర్మార్గమైన పాలన సాగుతోందని దీనిని అంతమొందించి ప్రజలకు కావాల్సిన అభివృద్ధి సంక్షేమ పాలనను తెచ్చుకోవాలని అందుకు ప్రజలు కాంగ్రెస్ను ఆదరించాలన్నారు. ముఖ్యంగా మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలుగుతారని అందుకే రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలను పిసిసి అధ్యక్షురాలుగా చేయడం జరిగిందన్నారు. అయితే రాష్ట్రంలో ఒక్క కాంగ్రెస్ అభ్యర్థి గాని, పార్లమెంట్ అభ్యర్థి గాని లేరని అయినప్పటికీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ షర్మిల నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తుందన్నారు. అందుకు షర్మిలాను బలపరచాలని రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకొనేందుకు, పార్టీని బలోపేతం చేసుకునేందుకు, ప్రజల సమానత్వం కోసం, మహిళల హక్కుల కోసం, అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో మార్పు కోసం కాంగ్రెస్ పార్టీని బలపరిచి ముందుకు తీసుకువెళ్లాలని సంజయ్ దత్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తొలుత పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సంజయ్ దత్ కు ఆహ్వానం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాష్, ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.ఏ. కె. హర్షద్, మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల. ఎలిజా, పామర్రు మాజీ ఎమ్మెల్యే డి వై దాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబిసి సెల్ చైర్మన్ సొంటి.నాగరాజు, జిల్లా పార్టీ కార్యదర్శి జగ్గవరపు బాబురావు, డిసిసి కార్యదర్శి కాగితాల సుదర్శన్ రావు, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా లక్కోజు సంజీవరాయ శర్మ 118 వ జయంతి



మచిలీపట్నం మేజర్ న్యూస్ : విజయవాడ బందర్ రోడ్డు లోని రామ్మోహన గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో "అపర గణిత బ్రహ్మ" లక్కోజు సంజీవరాయ శర్మ 118 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు కోసూరి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్వర శిల్ప సామ్రాట్, కళా రత్న, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ భవిరి రవి వ్యాఖ్యానం అలరించింది. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘ గౌరవ అధ్యక్షులు జవ్వాది కూర్మాచార్యులు, ఎన్టీఆర్ జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ నటరాజన్ షణ్ముగం, సెక్రటేరియట్ బిసి నాయకులు డాక్టర్ బత్తులఅప్పారావు, సంఘ గౌరవాధ్యక్షులు భవిరి శంకర్నాథ్, పేర్ల శ్రీనివాసరావు, పెదపాటి శేఖర్లు హాజరై సంజీవరాయ శర్మ గణిత ప్రతిభను కొనియాడారు. ప్రత్యేక అతిథిగా హాజరైన సంజీవరాయ శర్మ మనుమరాలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చీఫ్ మేనేజర్, లక్కోజు మాధురి లాలస ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాధురి లాలస మాట్లాడుతూ కడు పేదరికంలో పుట్టిన తమ తాతగారు జీవితంలో

### ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సంజీవరాయ శర్మ పురస్కార ప్రధాన ఉత్సవం

ఎన్నో కష్టాలు అనుభవించారని, పుట్టు గుడ్డి అయినప్పటికీ గణితం పై ఆసక్తితో 6 వేలకు పైగా గణితావ దానాలు చేయడం దేశ ప్రధానులు, రాష్ట్రపతి, బ్రిటిష్ గవర్నర్ జనరల్ వైస్రాయ్ లాంటి వారిచే మన్ననలు పొందారన్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు కోసూరి రాజశేఖర్ మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన రామానుజన్, ఉత్తర భారతానికి చెందిన డాక్టర్ శకుంతల దేవి వంటి వారిచే మన్ననలు పొందిన లక్కోజు సంజీవరాయ శర్మ తెలుగు వారవటం గర్వకారణమన్నారు. గణితంలో వారి ప్రతిభను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సముచితంగా గౌరవించాలన్నారు. సంఘ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ భవిరి రవి మాట్లాడుతూ ఎంతోమంది గణితావధానులు ఉన్నప్పటికీ జన్మతః అందునిగా జన్మించిన సంజీవరాయశర్మ ఇంతటి ఘన కీర్తిని పొందడం తెలుగువారి అదృష్టం అన్నారు.గణిత జ్ఞానం భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. గణితంలో విశేష ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు కొమ్మ వరపు కరుణాకర్, కొనకళ్ళ రమేష్ బాబు, మురమళ్ళ నాగలింగేశ్వరరావు, పుల్లేటికుర్తి వీరాచారి, జవ్వాది కనకదుర్గ ప్రసాద్, పులికొండ వెంకట కుమార్ రాజా లను సేవా సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కాలిఫోర్నియా యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పొందిన సంఘ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి స్వర శిల్ప సామ్రాట్ కళారత్న భవిరి రవిని సేవా సంఘం ప్రతినిధులు అభిమానులు ఘనంగా సత్కరించారు.వివిధ పాఠశాలల విద్యార్థులకు గణిత ప్రతిభా అవార్డులు అందించారు. నౌపడ కాళేశ్వరరావు, డాక్టర్ రామోజు శ్రీధర్ ప్రసాద్, మేడపి ప్రసాద్, సిద్దు చిరంజీవి ఆచారి, శేషగిరిరావు, కే గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో ముఖ్యఅతిథిగా గోపు సత్యనారాయణ



మచిలీపట్నం మేజర్ న్యూస్ : సకాలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు గ్రామంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న "గోపు" లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్‌ను స్వయంగా అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం కాదని, ప్రజల పట్ల ఉన్న సమిష్టి బాధ్యత అని తెలిపారు. సమయానికి, ఇంటి దగ్గరకే వచ్చి పెన్షన్ అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, అర్హులైన వారందరికీ నెలవారీ ఆర్థిక మద్దతు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ఆశయం అని తెలిపారు. పార్టీలకు అతీతంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించడం జరుగుతోందన్నారు.ఎవరికీ అన్యాయం జరగకుండా, ప్రతి అర్హుడి, గడప వద్దకే సంక్షేమం చేరేలా పని చేస్తున్నామన్నారు. కానూరు గ్రామంలో సుమారు 21 లక్షల రూపాయలను పింఛన్ల రూపంలో అందచేస్తున్నామన్నారు. సెక్రటరీ శ్రీహరి, బొమ్మిడి ఏడుకొండలు, పి.రాము, మోపిదేవి కృష్ణ, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, ఎం వెంకన్న, తెలుగుదేశం, జనసేన, బీజేపీ, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్నివిజయవంతం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.




## అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం

మొవ్వ మేజర్ న్యూస్: వి.ఎస్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కే.ఆర్. మంజుల అధ్యక్షతన ఎయిడ్స్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న నిర్వహించబడుతుందని చెప్పారు. హ్యూమన్ ఇమ్యూనోడెఫిసియెన్సీ వైరస్/అక్వైర్డ్ ఇమ్యూనోడెఫిసియెన్సీ సిండ్రోమ్ గురించి ప్రజలలో అవగాహన కల్పించడం. నివారణ చర్యలు వ్యాధి, నిరోధక చర్యలు సురక్షితమైన పద్ధతుల గురించి ప్రోత్సహించడం. ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు వారి కుటుంబాలకు మద్దతు, సామాజిక అంగీకారాన్ని అందించడం, వివక్షను తగ్గించడం. ఆరోగ్య సంరక్షణ ప్రాథమిక హక్కు అని నొక్కి చెప్పడం చికిత్స ప్రాముఖ్యతను తెలియజేయడం. ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని ఒక నిర్దిష్ట థీమ్‌తో నిర్వహిస్తారు. 2025 లో, "వివక్షను దూరం చేయడం ఎయిడ్స్ ప్రతిస్పందనను మార్చడం" అనే అంశాలపై దృష్టి సాధించడం జరిగిందన్నారు. విద్యార్థిని విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్ చేస్తూ ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించడం జరిగింది. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి శివ నాగేశ్వరరావు, డాక్టర్ ఎం సుందర్రావు, డాక్టర్ ఎం అనిల్ కుమార్ డాక్టర్ జి సురేష్ బాబు, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాలలో ఘనంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం





గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ డిసెంబరు 01 : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంను పురస్కరించుకొని గుడ్లవల్లేరులోని వి వి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నేడు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశ్యం హెచ్ ఐ వీ / ఎయిడ్స్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం, వ్యాధివ్యాప్తి మార్గాలు, నిరోధక చర్యలు, అలాగే బాధితుల పట్ల అపనమ్మకాలు, అపోహలను తొలగించడం. ఈ ర్యాలీని వి.వి. ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా. ఏ. లక్ష్మణరావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ప్రాముఖ్యత ను వివరించి, ఆరోగ్యం, అవగాహన కల్పించడంలో ముఖ్యంగా ఫార్మసీ విద్యార్థులు, యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. వారు హెచ్ఐవీ / ఎయిడ్స్ నివారణ, వ్యాధి సంక్రమణ మార్గాలు, సురక్షిత జీవనశైలి, అలాగే ఎయిడ్స్ బాధితుల పట్ల కరుణ, గౌరవ భావనలు కలిగి ఉండాలనే సందేశాలతో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ర్యాలీ గుడ్లవల్లేరు ప్రధాన వీధుల గుండా కొనసాగుతూ, మార్గ మధ్యంలో ప్రజలకు హెచ్ఐవీ / ఎయిడ్స్పై అవగాహన కల్పించే పాంప్లెట్లు (పత్రికలు) పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడినప్పుడు హెచ్ఐవీ / ఎయిడ్స్ నేటి వైద్య సాంకేతికతతో నియంత్రించ గలగిన వ్యాధి అని, సరైన సమాచారం, ముందస్తు పరీక్షలు, వైద్యుల సూచనల ప్రకారం చికిత్స తీసుకోవడం ద్వారా దీన్నిసమర్థవంతంగా నియంత్రించవచ్చని వివరించారు. అలాగే ఈవ్యాధి గ్రస్తుల పట్ల ఉన్న వివక్ష, నిర్లక్ష్యం, అపోహలను నిర్మూలించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, వినోద్ కుమార్ సమన్వయం చేయగా, కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది పూర్తిసహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ వి ఎల్ వినోద్ కుమార్ తో పాటు డాక్టర్ బాలకృష్ణ, నాగుల్ మీరావలి, హారిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## పోతేపల్లిలో పెన్షన్ పంపిణీ చేసిన కుంచె దుర్గాప్రసాద్



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ముఖ్యమంత్రి, గౌరవ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల ప్రకారం పోతేపల్లిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని బాబు క్లస్టర్ ఇంచార్జ్ తలారి సోమశేఖర్ గ్రామ పార్టీ కార్యదర్శి కమ్మిల మధు మహిళా అధ్యక్షురాలు నారగాని వాణి యూనిట్ ఇంచార్జ్ శేషు మండల బీసీ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం కాగిత గ్రామ పార్టీ అధ్యక్షులు చిన్ని బూత్ కన్వీనర్ పోతేపల్లి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొని పెన్షన్ పంపిణీ చేయడం జరిగింది.

## మీకోసం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యత



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని వాటిని చట్టపరిధిలో పరిష్కరించి న్యాయం అందించడానికి కృష్ణాజిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం మీకోసం కార్యక్రమానికి విచ్చేసిన ఫిర్యాదు దారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి,వారి సమస్యను విని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి. నాయుడు ప్రజల వద్ద నుండి ఫిర్యాదుల స్వీకరించారు.మీకోసం కార్యక్రమానికి 35 ఫిర్యాదులు అందాయి.

## ఎయిడ్స్ వ్యాధిని ద్వేషంచండి.. ఎయిడ్స్ రోగిని ఆదరించండి..




మచిలీపట్నం మేజర్ న్యూస్ : స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ పైన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకపూడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హాస్పిటల్ డాక్టర్ శ్రావ్య ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ ప్రజల్లో ఇంకా ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలి అన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్థులుపైన వివక్ష చూపించడం చట్టరీత్యా నేరం అన్నారు.ప్రిన్సిపాల్ పి.లక్ష్మి మాట్లాడుతూ,మా కళాశాల ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ద్వారా అవగాహనా ర్యాలీలు అవగాహనా సదస్సులు నిర్వహిస్తుట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలొ,ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు అధ్యాపకులు హిరణ్మయి, సాజిదా సుల్తానా,జ్యోతి,స్పందన వాలంటీర్లు పాల్గొన్నారు.

## "స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం"



మొవ్వ మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన మొవ్వ వి.ఎస్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కే. ఆర్. మంజుల అధ్యక్షతన."స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం జరిగింది". ఈ కార్యక్రమంలో 'సామాజిక బాధ్యతలు "అనే అంశంపై జరిగిన ప్రోగ్రాం లో డాక్టర్ సుందర్రావు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు సమాజంలో సామాజిక స్పృహ కలిగి ఉండాలని అదేవిధంగా సమాజ సేవ చేసే దాని కొరకు ప్రతి ఒక్కరం ముందుకు రావాలని ప్రతి ఒక్కరూ సమాజంలో సామాజిక బాధ్యత కలిగి ప్రవర్తించాలన్నారు. సమాజంలో ప్రతి పౌరుడు తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించటానికి విద్యార్థిని విద్యార్థులమైన మనము తప్పనిసరిగా మనం అవగాహన కల్పించవలసిన బాధ్యతుందన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ మంచి పౌరులుగా తీర్చిదిద్దే విధానంలో సత్ప్రవర్తనతో కూడిన విద్యను అభ్యసించి కళాశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ డాక్టర్ జి సురేష్ బాబు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## మైలవరంలో నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్.

**జి.కొండూరు, మేజర్ న్యూస్ :** మైలవరం పట్టణంలోని ఎస్వి కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామంలో సోమవారం ఆయన పింఛన్లు పంపిణీ అనంతరం మాట్లాడుతూ ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు వస్తున్నారని అన్నారు.పట్టా దరఖాస్తు పుస్తకాలు, సర్వే అంశాలు, ఇతరత్రా సమస్యలు, ముఖ్యంగా రెవిన్యూకు సంబంధించిన సమస్యలు చాలా పెండింగ్లో ఉన్నాయన్నారు.ప్రజలను పదేపదే తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని, ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా జిల్లా కలెక్టర్ని, జిల్లాలోని ఉన్నతాధికారులను ఆహ్వానించినట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మైలవరంలో ప్రజాదర్బారు కార్యక్రమం జరుగుతుందన్నారు.అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలు వ్యక్తిగతంగా ఉన్నా, గ్రామానికి సంబంధించినవి అయినా మైలవరంలోని ప్రజాదర్బారు దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైలవరం నియోజకవర్గ ప్రజలకు సూచించారు.

## గోనె సంచులు సప్లై చేసి కొనుగోలు ప్రారంభించాలి



**మొవ్వ మేజర్ న్యూస్:** మండలంలో యంత్రాల ద్వారా వరి పంట నూర్పుళ్ళు జరిపి మండల వ్యాప్తంగా రోడ్లపై పట్టాలపై ఉన్న రైతుల ధాన్యాన్నికి అన్ని గ్రామాలకు గొనే సంచులు సప్లై చేసి కొనుగోలు పక్రియ ప్రారంభించి రైతన్నలను, కౌలు రైతులను ఆదుకోవాలని ఎ పి కౌలు రైతు జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో మొంథాన్ తుఫాన్ వలన మానుగాయ వచ్చిన వరి పంటకు నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని, ఆది, సోమవారంలలో దిత్వా తుఫాను వలన వరి పంట నూర్చిన రైతులు ఆందోళనలో కొట్టిమిట్టాడుతున్నారు.తుఫాను తీరం దాటిన తరువాత కొంత ఉధృతి తగ్గిన ప్రభుత్వ విధానాల వలన కొనుగోలు విషయంలో రైతులు ఆవేదనతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో మాటల తప్ప చేతలలో రైతులను ఆదుకుంటుందన్న విశ్వాసం సన్నగిల్లిందన్నారు. ప్రభుత్వం రంగు మారిన ధాన్యం ముందు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, రైతుల ధాన్యం అమ్మకాలు మిల్లర్ల దయా దక్షిణాల కు వదిలేయకుండా రైతులను ఆదుకోనే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలంనారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు.

## స్వర్గీయ మండలి విగ్రహానికి నివాళులర్పించిన చిన్నకళ్లేపల్లి గ్రామస్తులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ పునర్నిర్మాత స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం స్థానిక వంతెన సెంటర్లో ఉన్న కృష్ణారావు విగ్రహానికి ఘంటసాల మండలం చిన్నకళ్లేపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షులు మాలెంపాటి సుధాకరరావు, తాడికొండ చిన్నా, పెరుకూరి చిట్టిబాబు, అంగత శ్రీరాములు, పోగుల ఏసోబు, పాపవినాశనం గ్రామ ప్రముఖులు కుంపటి చిట్టిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీ, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అవినీతి పంచాయతీ సర్పంచ్ జడ రాంబాబుపై ఉపసర్పంచ్ ఫైర్






**దుగ్గిరాలపాడు పంచాయతీలో 24 67 0 47 రూ మేర నిధులు దుర్వినియోగం**

**పంచాయతీ రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్న అధికారులు**

**దుగ్గిరాలపాడు సర్పంచ్ జడ రాంబాబుకు చెక్ పవర్ రద్దు చేస్తూ అధికారుల ఉత్తర్వులు**

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలం దుగ్గిరాలపాడు గ్రామంలో ఉప సర్పంచ్ కోపుర్ రాంబాబు మీడియా సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీ నిధులు భారీగా దుర్వినియోగం అయ్యాయని ఉప సర్పంచ్ కోపూరు రాంబాబు ఫిర్యాదు చేయగా జిల్లా పంచాయతీరాజ్ అధికారి పి లావణ్య కుమారి పంచాయతీ సర్పంచుకు షోకాజ్ నోటీసుల ఇచ్చి వారి వద్ద నుండి పంచయతీ రికార్డులను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ జరుపగా దుగ్గిరాలపాడు పంచాయతీ సాధారణ నిధులు 1238450 రూ దుర్వినియోగం అయ్యాయని 15వ ఆర్థిక సంఘం నిధులు 1228597 రూ రూనియోగం కాగా మొత్తం 24 67047 రూ దుర్వినియోగం అయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి ధ్రువీకరించారు సర్పంచ్ జడ రాంబాబు చెక్ పవర్ ను రద్దు చేస్తున్నట్లు డిపిఓ తెలిపారు వారు వెల్లడించారు దీనిపై ఒక విలేకరు వివరణ కోరగా తాను నిజాయితీపరుడు అంటూ ఎమ్మెల్యే తనపై కక్షయాధింపులు చర్యలు చేస్తున్నారని ఎమ్మెల్యే పై దుర్భాషలాడుతూ ఉప సర్పంచ్ వాడు వీడు అంటూ ఎస్సీ కులానికి చెందిన ఉప సర్పంచ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తను వివరించాడని సంబంధిత విలేకరు మాటలు రికార్డు చేసి తెలపగా ఉప సర్పంచ్ కోపూరు రాంబాబు అవినీతి సర్పంచ్ పై ఫైరయ్యారు కనీసం ప్లాట్ఫారం కూడా లేని వ్యక్తిని వార్డుకు కూడా గెలవలేనటువంటి ఒక వ్యక్తిని తెచ్చి తన సొంత నిధులు వెచ్చించి గ్రామ సర్పంచ్ గా గెలి వెధవని తెచ్చి స్థానిక ఎమ్మెల్యే మాకు అప్పగిస్తే గ్రామంలో ఒకటి రెండు రోజులు కూడా కాపురం ఉండనటువంటి సర్పంచును ప్రజల సొమ్ము దోచుకొని విలాసాలు చేసే ఒక పనికిమాలిన అవినీతిపరుడైన సర్పంచ్ జడ రాంబాబును ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ గ్రామంలో మాకు అప్పగిస్తే ఆయనకు ఇచ్చిన మాట కోసం అవినీతిపరుడైన జడ రాంబాబును సర్పంచ్ గా గ్రామ ప్రజలందరూ కష్టపడి గెలిపిస్తే స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పై అవాకులు చవాకులు పేలుస్తూ నేను నీతిమంతుడను అంటూ ఎమ్మెల్యే పై ఒక దళిత ఉప సర్పంచ్ కోపూరు రాంబాబు పై విచక్షణ రహితంగా అతని మనోభావాలు దెబ్బ తినే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నన్ను ఏమి పీకలేరు ఎంతమంది మీడియాలో రాసిన నాకు ఊడేది లేదంటూ రాలేదు అనేక దుర్భాషలు వాడిన జడ రాంబాబు పై చట్టపరమైన చర్యలు తీసుకొని దళిత ఉప సర్పంచ్ కోపూరు రాంబాబు మనోభావాలు దెబ్బ తినే విధంగా మాట్లాడినటువంటి అవినీతి సర్పంచ్ జడ రాంబాబు పై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు ప్రజల మేలు కోసం సర్పంచ్ గా గెలిపిస్తే సుమారు 25 లక్షల మేర అవినీతి చేసి ఎమ్మెల్యే పై దళితులైన నాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ సోమ రికవరీ చేయాలను ఆ సొమ్మును గ్రామపంచాయతీకి అప్పగించాలని ఒక దళితుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నైతికంగా భౌతికంగా దాడులు చేయడానికి సిద్ధపడ్డ అవినీతి సర్పంచి జడ రాంబాబు పై చట్టపరమైన చర్యలు తీసుకొని అవినీతికి పాల్పడ్డ సొమ్ము మొత్తం తిరిగి ప్రభుత్వం రికవరీ చేసి పంచాయతీకి అప్పగించాలని ఉప సర్పంచ్ రాంబాబు కోరారు.

# తెలుగుదేశం పార్టీలో చేరిన వైసీపీ నాయకులు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సమక్షంలో దాదాపు 20 మంది వైకాపాను వీడి, టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి తెలుగుదేశం పార్టీ పసుపు కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోనికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సాదరంగా ఆహ్వానించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యర్రగుంట దొరబాబు, యర్రగుంట రవి, యర్రగుంట రవితేజ, యర్రగుంట జేమ్స్, వరగాల యేసు, కోమర్లమూడి మణి, వినుకొండ దాసు, గురజాల ప్రియ, బెజవాడ వరలక్ష్మి, బెజవాడ వాసు, వంగూరి ఎరయ్య, యర్రగుంట సురేష్, గుడవర్తి రవి, నిమ్మకూరు దాసు, వరగాల రమేష్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తాను చాటాలని కోరారు. దీనివల్ల వెలగలేరు గ్రామంలో టీడీపీ మరింత బలోపేతం అవుతుందన్నారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ దార్శనికత కలిగిన సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం పురోగమిస్తుందన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



సమక్షంలో టీడీపీలో చేరటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలు, అమరావతి అభివృద్ధి, పారిశ్రామికీకరణ, మంత్రి లోకేష్ పాలనలో నూతన ఒరవడి సృష్టిస్తున్న తీరు, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పారదర్శక పాలనను చూసి ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వెల్లడించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకే బాలోత్సవం



**గన్నవరం, డిసెంబరు 1, మేజర్ న్యూస్ :** విద్యార్థులలో శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించేందుకు గన్నవరం బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం బాలోత్సవం నాలుగవ పిల్లల పండుగ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... మూడ విశ్వాసాలను వ్యతిరేకిస్తూ, శాస్త్రీయతను విద్యార్థులకి తెలియజెప్పే విధంగా చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు పిల్లల పండుగ తోడ్పడుతుందన్నారు. విద్యార్థులంతా ఒక్కటే, అందరం భారతీయులం దృక్పదంతో పోటీలలో భావజాలాన్ని నింపేందుకు కృషి చేస్తున్నామన్నారు. బాలోత్సవ కార్యనిర్వాహక అధ్యక్షులు గన్నె వెంకట్రావు మాట్లాడుతూ గత మూడేళ్ళ నుంచి బాలోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గన్నవరంతో పాటు ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుంచి వందలాది మంది విద్యార్థులు వస్తున్నారని తెలిపారు. ఈ నెల 12వ తేదీన బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. 8వ తేదీలోపు పోటీలలో పాల్గొని విద్యార్థుల లిస్టు అందజేయాలన్నారు. విద్యార్థులు చేసే ప్రతి ఈవెంట్ అందరిని ఆకట్టుకునే విధంగా ఉంటున్నాయన్నారు. ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్ మాట్లాడుతూ జూనియర్స్, సీనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. చిత్రలేఖనం, స్పాట్ డ్రాయింగ్, వ్యాసరచన, స్పెల్ బి మాప్, మెమెరి టెస్ట్, వక్తృత్వం, పద్యం-భావం, తెలుగులో మాట్లాడటం, కథచెప్పటం, క్విజ్, కల్చరల్ ఈవెంట్స్ ఉంటాయన్నారు. సబ్ జూనియర్స్ కు ఫ్యాన్సీ డ్రెస్ ఒక్కో పాఠశాల నుండి ఒకరు చొప్పున పాల్గొనవచ్చని చెప్పారు. ఇన్ఛార్జి హెచ్ఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# షాబుఖారి దర్గాకు వెళ్లే బ్రిడ్జి కూల్చే కుట్ర చేస్తున్న వీటిపిఎస్ అధికారులు

**హద్దు మీరిపోతున్న వీటిపిఎస్ అరాచకాలు**

**బ్రిడ్జి నిలిచే పిల్లర్లు తవ్వటం దేనికి సంకేతం**

**అక్కడ తవ్వితే బ్రిడ్జి కూలిపోతుందని**

**తెలియదని నమ్మటం హాస్యాస్పదం**



**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీలో కాలినడక దారి పది అడుగుల లోతు తవ్వి భక్తులు దర్గాకు రాకుండా అడ్డుకునే కుట్ర జరుగుతుందిదర్గాకు వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మార్చి దర్గాకు భక్తులు రాకుండా చేయాలని దుష్ట చర్య జరుగుతుందికొత్తగా నిర్మాణం చేస్తున్న కోల్ ( బొగ్గు) స్టోరేజీరైల్వే ట్రాక్ కోసం దర్గా, మసీదు భూములు ఆక్రమించాలనే కుట్ర దాగి ఉందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఉరుసు సమయంలో మత విద్వేషాలు రెచ్చగొట్టాలనే యాజమాన్యం కుట్ర చేస్తుందా... అని భక్తులు భయపడుతున్నారుగతంలో వీటీపీఎస్ నిర్మాణం కోసం 475 సర్వే నంబర్లో ఒక మసీదు కూల్చి, 85 సెంట్లు 424 సర్వే నెంబర్లు ఇంకో మసీదు కూల్చి, 16 ఎకరాలు 428 సర్వేనెంబర్ లో 4 ఎకరాల 30 సెంట్లు ఎవరి అనుమతి లేకుండా ఆక్రమించారు. ఇప్పుడు షాబుఖారి దర్గా మసీదు ప్రాంగణం ఆక్రమించాలనే కుట్ర చేస్తున్నారా.. అని అనుమానాలు కలుగుతున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన దర్గా హజరత్ సయ్యద్ షా బుఖారి బాబా ఉరుసు మహోత్సవం ఈనెల 29 30 31 తేదీలలో ఘనంగా నిర్వహించడం జరుగుతుంది.. ఉరుసు మహోత్సవానికి కులమతాలకు అతీతంగా లక్షలాదిగా భక్తులు పాల్గొంటారు. ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తరఫున ఉరుసు మహోత్సవం నిర్వహించడం కోసం స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య ఆధ్వర్యంలో మైలవరం నియోజవర్గ శాసనస భ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ని, పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్నిని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా దగ్గరకు ముస్లిం పెద్దలను ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ షబ్లీ సుఫి అల్తాఫ్ బాబా ను తీసుకువెళ్లి ఉర్సు మహోత్సవ ఏర్పాట్ల కోసం మాట్లాడటం జరిగింది... విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఎన్నో సందర్భాలలో వారి పార్లమెంటు పరిధిలో ఉన్న కనకదుర్గమ్మ వారి దసరా ఉత్సవాలు అట్లాగే మేరీ మాత గుణదల ఉత్సవాలు అదేవిధంగా షాబుఖారి బాబా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం తరఫున ఏర్పాట్లు చేస్తానని చెప్పారు. దురదృష్టం ఏమిటంటే దానికి భిన్నంగా ఎన్టిటిపిఎస్ విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ అధికారులు రహదారులు బీభత్సం చేయటం బ్రిడ్జి కింద తవ్వటం చూస్తుంటే లక్షలాదిగా వచ్చే భక్తులకు ఏదైనా ప్రాణ నష్టం జరిగితే దీనికి బాధ్యత వి టి పి ఎస్ అధికారులు తీసుకుంటారారాష్ట్ర ప్రభుత్వం వెంటనే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని. ప్రభుత్వం తరఫున ఉరుసు మహోత్సవ ఘనంగా నిర్వహించాలని.. సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా కోరారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేసిన డైరెక్టర్ దొండపాటి



**మైలవరం మేజర్ న్యూస్ :** మండలంలోని కీర్తిరాయునిగూడెం గ్రామంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ దొండపాటి విజయ్ కుమార్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని వైకాపా దుష్ప్రచారాలు నమ్మవద్దని, ఫేక్ పార్టీ చేసే దుష్ప్రచారాలు, దుష్పరిణామాలు ఎప్పటికప్పుడు పించన్ లబ్ధిదారులు తిప్పికొట్టాలని, మాకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల మా ఇంటి దగ్గరే పించన్ పంపిణీ చేస్తున్నారని మీ ద్వారా వారికి బుద్ధి చెప్పాలని లబ్ధిదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపీడీవోగా శివరాం ప్రసాద్ బాధ్యతలు



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో గా సోమవారం శివరాం ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. గతంలో మల్లంపల్లి, ఎండకుదురు గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యద ర్శులు పని చేశారు. అనంతరం బదిలీపై కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం పంచాయతీలో గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తూ పదోన్నతుపై ఘంటసాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పరిపాలనాధికారి శ్రీనివాస్ చం దు ఆహ్వానించి బొకే అందించారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో కే వెంక టేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు అందరూ శాలువాతో ఘనసత్కారం చేశారు.

## ఉదయాన్నే శ్రీకాకుళంలో పెన్షన్ పంపిణీ

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని ఉదయాన్నే ఎంపీడీవో డి. సుబ్బారావు, టీడీపీ నేత, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) కూటమి నేతలు ప్రారంభించారు. గ్రామంలోని పెన్షన్ లబ్ధిదారుల ఇళ్లకు ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, జనసేన పార్టీ నాయకులు కొండవీటి నాని, కొండవీటి కోటి, పువ్వాడ రవి వెళ్లి సోమవారం నగదు పంపిణీ చేశారు. కూటమి నాయకులు, గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తంగా ఉండండి :



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** తుఫాను ప్రమాదం తప్పినా అల్పపీడన కారణంగా చెదురుమదురు జల్లులు పడుతున్నా యని ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తం గా వ్యవహరించాలని ఏఓ రంగనాధ్బాబు సూచిం చారు. బాపులపాడు మండలం వీరవల్లి, కోడూరుపాడు గ్రామాల్లో సోమవారం పర్యటిస్తూ రైతులకు సూచనలిచ్చారు. జాతీయ రహదారి ప్రక్కన ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి వర్షం లేనప్పుడు పరదాలను తీసి గాలి అదే విధంగా చూడాలని, లేకపోతే ధాన్యం ముక్కి పోతాయన్నారు. కోత కోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లను ఆయా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకూ కోతలు ప్రారంబించవద్దన్నారు. తమ వద్ద ఉన్న ప్లాస్టిక్ పరదాలను కప్పి ఉంచి చినుకులు తగ్గగానే గాలి ఆడే విధంగా చూసుకోవాలని గాలి ఆడకపోతే ధాన్యం ముక్కి పోయే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ పర్యటనలో వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది ఉన్నారు.

# బాలోత్సవంలో ఐనపూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రథమ స్థానం



**ఉయ్యూరు/పమిడిముక్కల మేజర్ న్యూస్:** కృష్ణాజిల్లా స్థాయిలో నిర్వహించిన బాలోత్సవం కార్యక్రమంలో ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డాన్స్ ప్రదర్శనలో జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు తెలిపారు. ఉయ్యూరులోని శ్రీనివాస విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో జూనియర్స్ నాట్య ప్రదర్శనలో దూడల శివ వెంకట నాగ లాస్య, నల్లూరి సుస్మిత, బొప్పనపల్లి చందన, ఉమ్మిడాల పూజితలు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. క్లాసికల్ డాన్స్ ప్రదర్శనలో ఉమ్మిడాల పూజిత అద్భుతమైన ప్రతిభ చూపి అందరి చేత ప్రశంసలు అందుకున్నారని ప్రధానోపాధ్యాయులు వేణు తెలియజేశారు. బాలోత్సవ కార్యక్రమం నిర్వాహకులు పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలను, మెమెంటోలను, జ్ఞాపికలను, బహుమతులను అందజేశారు. ప్రశంసా పత్రాలను, బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యా యులు తమ్మన వేణుగోపాలరావు చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల విద్యా కమిటీ చైర్మన్ దూడల వెంకట శివ నాగభవాని, పాఠశాల ఉపాధ్యాయినిలు బుజ్జమ్మ, పూర్ణ చంద్రముఖి పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయినిలకు ప్రధానోపాధ్యాయులు వేణు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దూడల శివ నాగ భవానిలు పాఠశాల విద్యా కుటుంబం తరఫున ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.



## రామలింగేశ్వరుని సన్నిధిలో వేద పారాయణ

**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కూచిపూడి శ్రీ గంగా బాలా త్రిపురసుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో ఈనెల 7వతేదీన ఆదివారం సాయంత్రం "కృత్తికామండలవేద పారాయణ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు విశ్రాంత ఉపాధ్యాయులు చింతలపాటి రామకృష్ణ తెలిపారు. శ్రీరామలింగేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా ఆర్షవిద్యాపరిశోధనపరిషత్ అధ్యక్షులు కప్పగంతు వేంకట శివ సీతారామ శర్మ పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే 11 మంది వేద పండితులు, ఘనాపాటీల సారధ్యంలోఅత్యంత ఆహ్లాద కరమైన వాతావరణంలో వేద పారాయణ నిర్వహిస్తారని వెల్లడించారు. అలాగే ఉదయం శ్రీ రామలింగేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలనిఆయన కోరారు.

## ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసిన డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం లో మేనేజింగ్ డైరెక్టర్ తిరుమల రావు ని మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సూచనలతో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని జి.కొండూరు మండలంలోని తారక రామ ఎత్తిపోతల పథకం కింద ఆయుకట్టు గ్రామాల రైతులు ఇటీవల ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే కి తారకరామ ఎత్తిపోతల పథకాన్ని మేజర్ ఇరిగేషన్ నుంచి తప్పించి ఐడిసికి అప్పగించాలని చేసిన విన్నపాన్ని, ఎమ్మెల్యే సూచనలతో అంకెం ఇందిరా ప్రియదర్శిని ఇరిగేషన్ డెవలప్మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు, దీనిపై సానుకూలంగా స్పందించారు.

## బూత్ బలోపేత ప్రచారంలో విజయ్ కుమార్

**మైలవరం మేజర్ న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం బూత్ వ్యవస్థ పటిష్టతకు కార్యాచరణ విధానంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 54వ డివిజన్ 207వ బూత్ లో డివిజన్ ప్రెసిడెంట్, క్లస్టర్ ఇంచార్జ్, యూనిట్ ఇంచార్జ్, బూత్ కన్వీనర్ లతో ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ 54 55వ డివిజన్ పరిశీలకులు దొండపాటి విజయ్ కుమార్ సమావేశం నిర్వహించి 207వ బూత్ లో పార్టీ పటిష్టతకు సంబంధించి సమీక్ష నిర్వహించి నాయకులు, కార్యకర్తల సూచనలు తీసుకొని పార్టీ బలోపేతానికి కార్యాచరణ రూపొందించడం జరిగింది.. 207వ బూతులో ఉన్న స్థితిగతులపై నాయకులు చర్చించడం జరిగింది.. ఆ బూత్ లో గల సామాజిక వర్గాల నాయకుల్ని కలుపుకొని పార్టీని ఇంకా మెరుగ్గా బలోపేతం చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ప్రభుత్వం చేసే సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాలని నిర్ణయించడం జరిగింది. చం ద్రబాబు లోకేష్ బాబు కృషి వలన ఆంధ్రప్రదేశ్‌కి వస్తున్న కంపెనీల, పెట్టుబడుల వివరాలను డోర్ టు డోర్ వివరించాలని నిర్ణయించడం జరిగింది.

## చల్లపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా బాలాజీ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండల డిప్యూటీ ఎండీ పీ వో(జీఎస్డబ్ల్యూఎస్)గా ఎం.బాలాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేసిన బాలాజీ పదోన్నతిపై చల్లపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా నియమితుల య్యారు. ప్రభుత్వం ఇటీవలే గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల పర్యవేక్షణ కోసం పంచాయతీ అధికారులు, కార్యదర్శులను పదోన్నతులపై డిప్యూటీ ఎంపీడీవోలుగా నియామకం చేపట్టిన సంగతి తెలిసిందే. సోమవారం బాధ్యతలు స్వీకరించిన బాలాజీని పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చల్లపల్లి ఈవో పి.వి.మాధవేంద్రరావు తదితరులు బాలాజీని కలిసిన వారిలో ఉన్నారు.

# అర్హులందరికీ పింఛన్లు మంజూరు : యార్లగడ్డ







**గన్నవరం :** రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి తమ ప్రభుత్వం పింఛన్లు ఇస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో సోమవారం ఉదయం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో యార్లగడ్డ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందచేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా డిసెంబర్ నెల కు 40,871 మందికి సామాజిక పింఛన్ల రూపంలో రూ.17.53 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా 50 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెలా ఒకటో తేదీ సాయంత్రానికి దాదాపు లబ్ధిదారులందరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు వివరించారు. ఒకటో తేదీ సెలవు వస్తే ఒకరోజు ముందుగానే పింఛన్లు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని విచారణ అనంతరం అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం నున్న గ్రామంలో డాక్టర్ పోలారెడ్డి దినేష్ రెడ్డి కొత్తగా ఏర్పాటుచేసిన ఐడల్ హార్ట్ కేర్ సెంటర్ ను సోమవారం ఉదయం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సొంత గ్రామంలో గుండె వ్యాధుల వైద్యశాల ఏర్పాటు చేసిన దినేష్ రెడ్డిని అభినందించారు. వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ వైద్యశాలలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు అధునాతన వైద్యం అందించాలని ఈ సందర్భంగా యార్లగడ్డ పిలుపునిచ్చారు. అనంతరం రామవరప్పాడు గ్రామంలో ఆర్కే హోటల్ ను ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, విజయవాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షులు గొడ్డళ్ల చిన్న రామారావు, కొల్లా ఆనందకుమార్, బొప్పన హరికృష్ణ, స్వర్నాల బాలాజీ, పాతపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు కొండేటి వెంకటరత్నం, కలతోటి శ్రీనివాసరెడ్డి, బెజవాడ నాగేశ్వరరావు, కొండేటి శ్రీనివాసరావు, కోనేరు నాగేంద్ర కుమార్, గండికోట సీతయ్య, మేడేపల్లి రమ, నెక్కంటి శ్రీదేవి, గంపా శ్రీనివాస్, పట్టపు చంటి, షేక్ నబి, మాదు శివరాంప్రసాద్, కొరికానీ శ్రీనివాసరావు,అంబాపురం తెలుగు యువత అధ్యక్షుడు చల్లగాలి సునీల్ కుమార్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్:** ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వంటి సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, ప్రజల ఇళ్ల దాకా తీసుకెళుతోందని పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. తోట్లవల్లూరు మండల పరిధిలోని పెనమకూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పింఛనుదారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుడి జీవిత ప్రమాణాలు మెరుగుపడేందుకు ప్రభుత్వం ప్రతి రంగంలో అభివృద్ధి – సంక్షేమాలను సమన్వయంతో అమలు చేస్తోందన్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, విద్య – వైద్య రంగాలలో నాణ్యత పెంపు, రైతులకు సమయానుకూలంగా మద్దతు ధరలు, సబ్సిడీల చెల్లింపు వంటి చర్యలతో ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతోందని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల అభ్యున్నతి కోసం తీసుకున్న ప్రతి నిర్ణయం వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికేనని పేర్కొన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అడ్డంకులు లేకుండా చేరేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ సామాజిక భద్రత భరోసా పింఛన్లు గ్రామంలోని అర్హులందరికీ చేరేలా ప్రభుత్వం చేస్తున్న సేవలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తోట్లవల్లూరు మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్, ఎండిఓ రవికాంత్, పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### భాషా కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన తోట్లవల్లూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు భాషా కుటుంబ సభ్యులను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించారు. ఇటీవల భాషా తల్లి మాలిన్ మృతిచెందగా ఎమ్మెల్యే కుమార్ రాజా భాషా ఇంటికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 5న అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** ఈనెల 5వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వెల్లడించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మూడవసారి మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహించనున్నామన్నారు. గతంలో నిర్వహించిన రెండు సమావేశాలు చాలా విజయవంతం అయ్యాయన్నారు. అయితే ఈసారి జిలాలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు అంటే ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మాత్రమే సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తు బాగా రాణించాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ సమావేశం తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మధ్య వారధి లాగా పనిచేస్తుందన్నారు. ఈ సమావేశం ద్వారా విద్యార్థుల విద్యా పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేసే అవకాశం లభిస్తుందన్నారు. దాంతో తల్లిదండ్రుల సహకారం కూడా పొందవచ్చున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల పోలిస్టిక్ పురోగతి కార్డులను అందజేస్తామని అందులో ఏ విద్యార్థి ఏ ఏ స్థాయిలో ఉన్నారో వారికి తెలుస్తుంది అన్నారు. ఏమి చేస్తే ఆ విద్యార్థి తదుపరిస్తాయికి వెళతారో ఆ విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. అంతేకాకుండా ఈసారి వినూత్నంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎఫ్ఎల్ఎం అనే పేరుతో బేస్ లైన్ పరీక్షలు నిర్వహించి వారు ఏ ఏ స్థాయిలో ఉన్నారో వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆ ప్రకారంగా వంద రోజుల ఒక కార్యాచరణ ప్రణాళిక అమలుపరిచి రాబోయే తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశానికి తల్లిదండ్రులకు నివేదిక అందజేస్తామన్నారు. ఆ విధంగా విద్యార్థుల్లో ఏమి మార్పు వచ్చిందో కూడా గమనించవచ్చున్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పకుండా ఈ సమావేశంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి పి వి జె రామారావు పాల్గొన్నారు.



## సమస్యల వలయంలో రామచంద్రాపురం



### రామచంద్రపురంలో వెలగని వీధి దీపాలు

### తాగటానికి మంచినీటి కరువు తీవ్రమైన డ్రైనేజీ సమస్య

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** రామచంద్రాపురం గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక గ్రామ సచివాలయం వద్ద సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పి ఆనందరావు మాట్లాడుతూ నాలుగు నెలల నుండి వీధి దీపాలు వెలగక రోడ్లపై నడుద్దాం అంటే రాత్రి సమయంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు అన్నారు. తీవ్రమైన మంచినీటి ఎద్దడితోపాటు రాత్రివేళ వీధి దీపాలు వెలగక గ్రామ ప్రజలు అష్ట కష్టాలపాలు పడుతున్నారన్నారు. గ్రామంలో అంతర్గత రహదారులు సరిగా లేక చిన్నపాటి చినుకుకే మోకాలి లోతు బురదలో నడవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. అలానే సరి అయిన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షం పడినప్పుడు మురుగునీరు రోడ్డుపైకి గృహాల్లోకి చేరి గ్రామ ప్రజలు అనారోగ్యాల పాలు అయ్యే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, సచివాలయంలో ఉద్యోగులకు కూడా నీటి సదుపాయం లేదని తక్షణమే మోటార్ బిగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రామచంద్రపురం గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ఎమ్మెల్యే వెనిగండ్ల జన్మదినవేడుకలు

### శుభాకాంక్షలు శ్రీకొండలమ్మ దేవస్థానం కార్యవర్గం, ఈఓ, సిబ్బంది శుభాకాంక్షలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ డిసెంబరు 01 :** గుడివాడ నియోజకవర్గ శాసన సభ్యులు వెలిగండ్ల రాము జన్మదినం సందర్భంగా వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయం చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, ఈవో ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు తూము రాజ్య లక్ష్మి, కల్లేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు, అర్చకులు, ఎక్స్ అఫీషియో మెంబర్ రుద్రపాక శివ సంతోష్ శర్మ, దేవస్థానం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసినారు. అర్చక శివ సంతోష్ శర్మ వేద మంత్రోచ్ఛారణ తో ఆశీర్వచనం చేసినారు. చైర్మన్ ఈడే మోహన్, ఈవో ఆకుల కొండలరావు, సభ్యులు శ్రీ అమ్మవారి చిత్ర పటం బహుకరించి, శ్రీ అమ్మవారి శేష వస్త్రం తో శాసన సభ్యులు వెనిగండ్ల రామును సత్కరించారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999